# మదన విలాస్ లాడ్జి



"రాజ్యం- రాజ్యం..." అంటూ వచ్చాడు జగన్నాథం.

"ఏమిస్వామీ... మళ్లీ ప్రయాణమా?" అంది రాజ్యం గునుస్తూ.

"అబ్బో... కనిపెట్టేశావే?" అన్నాడు జగన్నాథం ఆశ్చర్యంతో.

"ఇదేమైనా కొత్తకనకనా? ఎన్నాళ్ళు క్యాంపు?" అంది రాజ్యం.

"ఎన్నాళ్లోనా... మూడు రోజులే!"

"మూడు రోజులు మిమ్మల్ని వదిలి ఎల్లాగండీ ఉండడం?"

"అబ్బో... నీ వగలకేమీ లోటు లేదు. అయినా నేను ఊళ్ళు వెళ్తుండడం, నువ్వు విరహం ప్రదర్శిస్తుండడం మామూలేగా!"

"మీకు అల్లాగే ఉంటుంది. అనగా అనగానైనా మీరు దారికి వస్తారేమోనని ఆశ!"

"దారికి రావడానికి నేనేమీ దారి తప్పలేదే!"

" ఏమో... ఎవరు చూశారు? బయటికి పోయిన మనిషిని ఎవరు నమ్మారు- మీ వ్యాపారం చాటున ఇంకెన్ని వ్యాపారాలు చేస్తున్నారో?" అంది రాజ్యం కొంటెగా నవ్వుతూ.

"చంపావుపో..! అందుకే స్త్రీ బుద్ధీ... అన్నారు."

"అలా అన్నవారు మగవారే కాని.., ఇంతకీ ఏ ఊరు ప్రయాణం?"

"మదరాసు! అయితేనేం... మూడో నాటికల్లా వస్తాగా!"

" ఊ... సర్లెండి. మీరు లేంది నాకిక్కడ ఏం తోస్తుంది? కాలక్షేపానికైనా కానీ పిల్లలుకూడా లేరు గదా! మీరు నన్ను తెనాలిలో మా పుట్టింట్లో దింపేసి వెళ్లండి."

"మధ్య నేను దింపడం ఎందుకు? తిన్నగా బస్సెక్కి నువ్వే వెళ్లు. ఒంటరిగా వెళ్లడం నీకేం కొత్తకనుకనా? వచ్చేటప్పుడు నేను తెనాలిలో దిగుతాను. ఇద్దరం కలిసి వద్దాం."

"సరే... మీ ఇష్టం!" అంది రాజ్యం.

ఆరోజే జగన్నాధం మద్రాసుకీ, రాజ్యం తెనాలికీ వెళ్లిపోయారు.

* * *

విజయవాడలో 'మదన విలాస్ లాడ్జి' చాలా పేరు పొందింది.

ఏ రిక్షావాడిని అడిగినా, టాక్సీవాడిని అడిగినా ఆ లాడ్జీకి ఇట్టే తీసుకెళ్తారు.

అక్కడ మడతమంచాల దగ్గర నుంచి మహా భోగాలతో అలరారే పడకగదుల వరకు అన్నీ అద్దెకు దొరుకుతాయి. రాత్రి అయ్యేసరికి ఆ లాడ్జి వింత శోభని సంతరించుకుంటుంది. రకరకాల వన్నెల విసనకర్రలు రంగురంగుల సీతాకోకచిలుకల్లాగా అలంకరించుకుని అందులోని పడకగదులని అలంకరిస్తారు. అందులోకి ప్రవేశించిన ఘరానా మనుషులని మేనేజిమెంటువారు అత్యంత రాచమర్యాదలతో ఆహ్వానించి సత్కరిస్తుంటారు.

లాడ్జి బయట టాక్సీ ఆగింది. అందులో వచ్చిన వ్యక్తి టాక్సీ దిగి డబ్బులు ఇస్తుండగానే, లాడ్జీలోని వెయిటర్ బయటికి వెళ్లి ఆ వ్యక్తి సూట్‌కేస్ అందుకున్నాడు.

లోపలికి వస్తున్న ఆ వ్యక్తిని చూస్తూనే మేనేజర్- "హల్లోసార్... చాలాకాలమైంది తమరు దయచేసి!" అంటూ రిసీవ్ చేసుకున్నాడు.

"ఏదీ... వ్యాపారం ఊపిరి సలపనివ్వడం లేదు. అది సరేకాని.., అంతా పాత సరుకేనా, ఏమైనా కొత్తపిట్టలు వచ్చాయా?" అని అడిగాడు ఆ వ్యక్తి.

"భలేవారే సార్- కొత్తకొత్త పిట్టలు రాందే మీవంటివారు వస్తారా, మా బిజినెస్ నడుస్తుందా!?" అన్నాడు మేనేజర్ సిగ్గుపడిపోతూ.

"సరే... ఏవన్ మోడల్ పిట్ట కావాలి. నా టేస్ట్ మీకు తెలుసుగా!" అన్నాడు ఆ వ్యక్తి ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"ఆ మాట వేరే చెప్పాలా సార్! మీరు రూంకి పోయి, టాయిలెట్ అయి రండి, మీరు వచ్చేసరికి అంతా రెడీ!" అన్నాడు మేనేజర్.

"అవసరం లేదు. స్టేషన్‌లోనే డ్రెస్ ఛేంజ్ చేసుకుని వచ్చాను" అన్నాడు ఆ వ్యక్తి.

"ఇంకేం- అయితే సరే!" అని అతనితో అని, వెయిటర్ వంక చూస్తూ "ఒరేయ్... అయ్యగారి సూట్‌కేసు అర్వై నంబర్ గదిలో పెట్టి, వారిని 92వ రూంలోకి తీసుకెళ్లు" అన్నాడు మేనేజర్.

"చిత్తం..." అంటూ వెయిటర్ ముందుకు సాగాడు.

వెనకాలే వెళ్లాడు ఆ వ్యక్తి.

92వ గది అందంగా అలంకరించబడి ఉంది. అందులో డబుల్ కాట్ మీద ఒక అందమైన యువతి- మిలమిలా మెరిసే చీరలో మరింత మెరిసిపోతూ, మేలిముసుగు వేసుకుకూర్చున్నది.

ఆ వ్యక్తి ఆప్యాయంగా ఆమె దగ్గరికి వెళ్లి, ఆ మేలిముసుగు తొలగించి ఆప్యాయంగా ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. అంతే..!

వెంటనే షాక్ కొట్టినట్లు "రాజ్యం..!" అని గట్టిగా అరిచాడు.

ఆ కేక విని ఆమె అరమోడ్పు కన్నులను పూర్తిగా విప్పి అతని వంక చూసి, "మీరా!" అని పెద్ద కేకవేసి వెనక్కి విరుచుకుపడిపోయింది.

వాళ్ళ అరుపులతో మదనవిలాస్ లాడ్జీ దద్దరిల్లింది.

- హాస్యప్రభ... ఏప్రిల్ ' 77